సాక్షి
మంచిర్యాల
సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



తాగినడిపితే బీమా కట్! 8లో▸
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా సత్ఫలితాలు రావడం లేదు. ఈ క్రమంలో తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్(బీమా) రాకుండా చేస్తోంది.



'చిరుతల' రామాయణం
మద్దెల దరువుల, తాళాల చప్పళ్లతో కొత్తపల్లి గ్రామం పరవశిస్తోంది. శృతి తప్పని పాటలు అనుగుణమైన నృత్యాలతో హోరెత్తుతోంది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.4 /27.5
ఆకాశం అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఎండ తీవ్రత పెరుగుతుంది. గాలిలో తేమ తగ్గి ఉక్క పోత అధికమౌతుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ సోమ: 6:33 | సహర్ మంగళ: 4:33

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష



పరీక్షా సెంటర్‌లో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. 6 నుంచి 10వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలకు 2,976 మంది విద్యార్థులకు 2,630 మంది హాజరయ్యారు. 6వ తరగతి విద్యార్థులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతుల్లో మిగులు సీట్లకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పది పరీక్ష కేంద్రాల్లో ఉదయం ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 1,649 మంది విద్యార్థులకు 1,382 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 7వ తరగతికి 570 మందికి 491 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8వ తరగతికి 429 మందికి 364, 9వ తరగతికి 260 మందికి 226 మంది, పదో తరగతికి 68 మందికి 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో పలు పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.

కేంద్ర మంత్రి దృష్టికి సమస్యలు



కేంద్రమంత్రికి సమస్య వివరిస్తున్న బాధితులు

లక్సెట్టిపేట: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల వెళ్లే 63వ జాతీయ రహదారి విస్తరణ పనులతో లక్సెట్టిపేట మున్సిపాలిటీ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉండడంతో స్థానికులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఆదివారం నాగపూర్‌కు వెళ్లి మంత్రిని అక్కడి క్యాంపు కార్యాలయంలో కలిసి రోడ్డు విస్తరణతో జరిగే నష్టాన్ని వివరించారు. వినతిపత్రం అందించారు. ఒకవైపు మాత్రమే భూసేకరణ జరపడంతో ఇళ్లు, భూములు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇరువైపులా భూ సేకరణ జరిపి అందరికీ న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో మైలారం శ్రీనివాస్, డాక్టర్ శరత్‌బాబు, నలి మెల సత్తయ్య, మల్లారెడ్డి, వెంకారెడ్డి, మసాలా సతీశ్, కాట్రాగడ్డ వీరస్వామి, మడిపల్లి స్వామి, రంజిత్‌సింగ్, రాజేందర్, వేముల గురువయ్య, బియ్యాల విజయ్‌కుమార్, గోపతి రవి, రాందేని చిన్నవారైనా తిరుమలరావు, రైతుబంధు సమితి హాజీపూర్ కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, నాయకులు లగిశెట్టి రాజన్న, మోటపలుకుల తిరుపతి, కందుల రమేశ్ ఉన్నారు.

జేబీసీసీఐలో పెన్షన్‌పై చర్చించాలి

శ్రీరాంపూర్: ఈ నెలలో జరిగే జేబీసీసీఐ సమావేశాల్లో రిటైర్డ్ కార్మికుల సమస్యలు, పెన్షన్, ఇతర సమస్యలపై చర్చించాలని టీబీజీకేఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి కోటిలింగం, నాయకులు మక్బూల్ హుస్సేన్, శేషగిరిరావు జాతీయ సంఘాల నేతలను కోరారు. పెన్షన్ చట్టం చేసినప్పటి నుంచి ఇప్పటికి ఒక్క పైసా పెరగలేదన్నారు. దీంతో చాలీచాలని పెన్షన్‌తో రిటైర్డ్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశంలో పెన్షన్ పెంచేలా ఒత్తిడి తేవాలని సూచించారు. పెన్షన్ ఫండ్ 7 శాతం వరకు పెరిగిందని, బొగ్గు కంపెనీ ఫండ్‌ను బలోపేతం చేయడం కోసం టన్ను బొగ్గు అమ్మకానికి రూ.15 చొప్పున జమ చేస్తున్నా ఇప్పటికీ 25 శాతం పెన్షన్ మాత్రమే అమలు అవుతుందని వివరించారు. రిటైర్డ్ కార్మికుల వైద్య చికిత్సకు సంబంధించిన సీపీఆర్ఎంఎస్ స్కీం ఏమాత్రం ప్రయోజనకారిగా లేదన్నారు. అధికారులు, కార్మికులను ఒకే ట్రస్ట్ క్రింద చేర్చి సమాన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రా ట్యుటీ చెల్లింపుల్లో అధికారులకు 2017 నుంచి రూ.20 లక్షలు చెల్లిస్తున్నా కార్మికులకు మాత్రం 2018, ఏప్రిల్ నుంచి అమలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. గ్రాట్యుటీ చట్టంలో దేశ వ్యాప్తంగా ఒకే రకమైన పద్ధతి అమలు చేయాలని కోరారు. జాతీయ సంఘాలు రిటైర్డ్ కార్మికులతో పనిలేదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఫుడ్.. ప్రాసెసింగ్



ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో విశాలంగా నిర్మించిన రోడ్డు

- పరిశ్రమల ఏర్పాటుపై కదలికలు..!
- దరఖాస్తుదారులతో ఇటీవల ప్రత్యేక సమావేశం
- స్థానికులకు తొలి ప్రాధాన్యం?

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఏర్పాటు చేయనున్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఎట్టకేలకు పరిశ్రమల ఏర్పాటు విషయంలో కదలిక వచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నవారితో అధికారులు ఇటీవలే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు రిపోర్టు, ఉత్పత్తులు, మార్కెటింగ్, ఆదాయ వ్యయాలపై కూలంకషంగా చర్చించారు. త్వరలోనే పరిశ్రమల ఏర్పాటుపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

రూ.30 కోట్లతో నిర్మాణాలు..
ఇదిలా ఉంటే ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో రూ.30 కోట్ల అంచనాతో ఇప్పటికే రోడ్లు, కల్వర్టులు నిర్మించారు. విద్యుత్ సౌకర్యం పనులు చకచకా జరుగుతున్నాయి. మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తిచేసి పరిశ్రలు నెలకొల్పాలనే లక్ష్యంతో అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో మొన్నటి వరకు మందకొడిగా సాగిన పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. వర్షాకాలం రాకముందే పనులను పూర్తి చేసి సానుకూలంగా ఉన్న దరఖాస్తుదారులతో పరిశ్రమలను ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి..
బెల్లంపల్లి ప్రాంతంలో బొగ్గు గనులు క్రమంగా కనుమరుగు కావడంతో ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను మంజూరు చేసింది. రూ.1500 కోట్ల అంచనాతో ఏర్పాటు చేసే ఈ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌తో ఈ ప్రాంతంలోని వందలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇందులో వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించడానికి ప్రాధాన్యత ఇస్తారు. ప్రధానంగా రైస్ మిల్లులు, బియ్యం ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమలు, పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, పాలు, కోళ్లు, పప్పు ధాన్యాలు, డెయిరీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

త్వరలో అనుమతి
ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఔత్సాహికులు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవలే దరఖాస్తుదారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాం. పది మంది స్థానికులైన దరఖాస్తుదారులు ప్రభుత్వానికి రూ.10 లక్షల చొప్పున డిపాజిట్ చేశారు. మిగతా బ్యాలెన్స్ డిపాజిట్‌ను చెల్లించాల్సి ఉండగా అందుకు దరఖాస్తుదారులు సానుకూలంగా స్పందించారు. వీరికి ముందస్తుగా అనుమతి ఇవ్వాలనే యోచనలో ఉన్నాం. త్వరలోనే అనుమతులు మంజూరు చేసేలా కసరత్తు చేస్తున్నాం.
– స్వామి, టీఐఐసీ జోనల్ మేనేజర్, కరీంనగర్

రూ.10 లక్షల డిపాజిట్..
ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో పరిశ్రమల స్థాపన కోసం మొత్తం 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం వీరు రూ.10 లక్షల చొప్పున డిపాజిట్ కూడా చేశారు. ఈ దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని ఆమోదించడానికి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. తుది నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసే అవకాశం ఉండగా, ఇందులో తొలి ప్రాధాన్యత స్థానికులకు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు సంసిద్ధత తెలిపినట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే రెండు నెలల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో త్వరలోనే పరిశ్రమల స్థాపన జరుగుతుంది. మొదట పప్పులు, మిర్చి, రైస్, ఆయిల్ మిల్లులను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలు రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఐఐసీ) అజమాయిషీలో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు, వేదకపై ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తరిమి కొడుదాం
- ఆత్మీయ సమ్మేళనంలో నారదాసు లక్ష్మణ్‌రావు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాలక్రైం: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాల్సిన సమయం దగ్గర పడిందని బీఆర్ఎస్ మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. మంచిర్యాలలో స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారదాసు హాజరై మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎర్రకోటపై గులాబీ జెండా ఎగిరేలా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆరు నెలల్లో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోమారు గెలిపించాలని సూచించారు. తెలంగాణలో సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఈ ఘటన కేసీఆర్‌దే అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావును అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంతోపాటు దేశంలోనూ గులాబీ జెండా ఎగిరేలా ప్రతీ కార్యకర్త శ్రమించాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయ మాటలకు మోసపోవద్దని సూచించారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో నియోజకవర్గానికి భారీగా నిధులు తెచ్చానని తెలిపారు. కేసీఆర్ పాలన విధానం చూసి ఇతర రాష్ట్రాల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో 61 ఎకరాల భూమిని కబ్జా చేసిన ప్రేమ్‌సాగర్‌రావ్, అక్రమ దందాలతో సంపాదించిన డబ్బులతో బట్టి పాదయాత్ర చేస్తున్నాడని ఆరోపించారు. భూకబ్జా ఆరోపణలు, గుండాగా ముద్ర ఉన్న ప్రేమ్ సాగర్‌రావుకు ప్రజలు మరోమారు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు సుదమళ్ల హరికృష్ణ, గాదె సత్యం, అత్తి సరోజ, గరిగంటి సరోజ, ఎండీ.తాజొద్దీన్, బీఆర్ఎస్ యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు పాల్గొన్నారు.

జోరు పెంచి.. జోష్ నింపి..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముగిసిన 'భట్టి' పాదయాత్ర
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశం
- ఘనంగా వీడ్కోలు పలికిన కాంగ్రెస్ నేతలు



ఎల్లంపల్లి ప్రాజెక్టుమీదుగా పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్కతో, సురేఖ, ప్రేమ్‌సాగర్‌రావు, నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న 'భట్టి'

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా పిప్రి వద్ద షురూ అయిన ఈ యాత్ర 31 రోజుల పాటు సాగింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా సాయంత్రం పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఇంటి నుంచి యాత్ర ప్రారంభమైంది. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి భట్టి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉత్సవ విగ్రహంలా ఎమ్మెల్యే..
ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మంచిర్యాల అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. గోదావరి బ్యాక్ వాటర్ వచ్చి, రాళ్లవాగు ఉప్పొంగి ఈ ప్రాంతం మునిగిపోయినా నిరాశ్రయులను ఆదుకోకుండా, వారికి పరిహారం ఇవ్వకుండా, ఉత్సవ విగ్రహంలా దివాకర్‌రావు ఉన్నారని విమర్శించారు. స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నా లేకపోయినా ఒక్కటే అన్నారు. పనిచేయని ఎమ్మెల్యే మనకు అవసరమా అని ప్రజలను ప్రశ్నించారు. యాత్రలో పాల్గొన్న జనం మాకు అవసరం లేదంటూ నినాదాలు చేశారు. పనిచేసే వారు, ఈ ప్రాంత ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసే నాయకులే మనకు కావాలన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం తపించే నా యకుడు ప్రేమ్‌సాగర్‌రావు అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కో రారు. చేతగాని ఎమ్మెల్యే దివాకర్‌రావు గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని ఎద్దేవా చేశారు.

సమస్యలు తెలుసుకుంటూ...
పాదయాత్రలో భాగంగా మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తాలో దోస, పండ్లు అమ్ముకునే వారిని భట్టి పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేదరివాడలో వెదురు బుట్టలు, చాటలు తయారు చేసి అమ్ముకునే బొల్లం రజితతో మాట్లాడగా, తాను బీఈడీ చదివానని చెప్పింది. ఎనిమిదేళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక తప్పనిసరి పరిస్థితుల్లో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోగా, డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు సైతం ఇవ్వడం లేదని చెప్పింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే కులవృత్తులకు పెద్దపీట వేస్తామని, ఉద్యోగాలు భర్తీ చేస్తామని భట్టి తెలిపారు.

హాజీపూర్ మండలంలో ఘన స్వాగతం..
పాదయాత్ర హాజీపూర్ మండలం వేంపల్లికి చేరగానే స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. భట్టితోపాటు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీటీసీ దేగ బాపు దంపతులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా ముల్కల్ల, గుడిపేట వరకు యాత్ర చేశారు. గుడిపేటలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత గుడిపేట గోదావరి రోడ్ మీదుగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా భట్టి విక్రమార్క పాదయాత్ర సాగింది. భట్టి విక్రమార్క పాదయాత్రలో స్థానికులకు అభివాదం చేస్తూ కలిసిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించాలని, నాలుగు వరసల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లు, భూములు కోల్పోకుండా అందరికీ సమన్యాయం జరిగేలా చూడాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై కేక్ కటింగ్..
పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 300 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై కేక్ కట్ చేశారు. మత్స్యకారులు భట్టికి చేపల వల అందజేశారు. అనంతరం భట్టి పాదయాత్రకు ప్రాజెక్ట్ వద్ద ఘనంగా వీడ్కోలు పలికారు. పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు భట్టికి జిల్లాలోకి స్వాగతం పలికారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిట్ల సత్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, ఎంపీటీసీ బాలరాజు, నాయకులు సురేందర్, కుమార్ యాదవ్, పార్టీ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు శ్రీముఖాలు..!

- టెన్త్ 'స్పాట్'కు 60 మంది దూరం
- గైర్హాజర్ ఉపాధ్యాయులపై విద్యాశాఖ సీరియస్



స్పాట్ వాల్యుయేషన్ వద్ద ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కార్మెల్ హైస్కూల్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న పదో తరగతి స్పాట్ వాల్యువేషన్ ప్రభుత్వ ఉపాధ్యాయులు దూరంగా ఉంటున్నారు. విధులు కేటాయించినా గైర్హాజర్ అవుతున్నారు. అనుమతి లేకుండా విధులకు హాజరు కాకపోవడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. స్పాట్ విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులపై చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. విధులకు డుమ్మా కొట్టిన టీచర్లకు శ్రీముఖాలు ఇవ్వాలని నిర్ణయించింది.

9 రోజులు మూల్యాంకనం..
ఈనెల 13 నుంచి టెన్త్ స్పాట్ వాల్యువేషన్ ప్రారంభించారు. 21వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్పాట్ వాల్యుయేషన్ జరుగుతుంది. మూల్యాంకనం ప్రారంభించి నాలుగు రోజులు గడుస్తున్నా 60 మంది ఉపాధ్యాయులు రిపోర్టు చేయకపోవటంతో శ్రీముఖాలు(మెమో)లు జారీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. విధులకు గైర్హాజర్ అయిన వారిలో సగానికిపైగా సోషల్ టీచర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

డుమ్మాపై సీరియస్...
జిల్లాలో మొదటిసారిగా నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్‌కు ఆసిఫాబాద్ కుమురంభీమ్, మంచిర్యాలకు చెందిన ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. విధుల్లో అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు -10, సహాయ అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు -10, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా తెలుగు -55, హిందీ -92, ఇంగ్లిష్ 82, గణితం -105, భౌతికశాస్త్రం -102, జీవశాస్త్రం-115, సాంఘిక శాస్త్రం-174, స్పెషల్ అసిస్టెంట్లు-203 మంది మొత్తం 928 మందిని నియమించారు. ఈనెల 13న ప్రారంభమైన స్పాట్ వాల్యుయేషన్ కోసం మొదటి రోజున తెలు గు 38, హిందీ 63, ఇంగ్లిష్-60, గణితం 81, భౌతిక శాస్త్రం -70, జీవశాస్త్రం -69, సోషల్ 124 మంది ఉపాధ్యాయులు రిపోర్టు చేశారు. మిగిలిన ఉపాధ్యాయులకు పదేపదే ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో విద్యాశాఖ చర్యలకు సిద్ధమవుతోంది.

క్యాంపు చేరువైనా.. విధులకు దూరం..
గతంలో టెన్త్ స్పాట్ వాల్యువేషన్ ఆదిలాబాద్, నిర్మల్‌లో నిర్వహించేవారు. అవి దూరంగా ఉండడంతో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఉపాధ్యాయులు మూల్యాంకన విధులకు దూరంగా ఉండేవా రు. ఈ ఏడాది మంచిర్యాలకు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం కేటాయించారు. కేంద్రం చేరువైనా.. ఉపాధ్యాయులు మాత్రం మూల్యాంకనానికి దూరంగానే ఉంటున్నారు. నాడు దూరభారంతో మూల్యాంకనానికి వెళ్లడం లేదని భావించేవారు. కానీ ప్రస్తుతం కూడా విధులకు డుమ్మాకొడుతున్నారు. అనారోగ్యం పేరిట కొందరు వ్యక్తిగత వినతులను సమర్పించారు. కారణాలు ఏమైనా మూల్యాంకనానికి గైర్హాజరవుతున్న వారిలో కొందరు బడులకు వెళ్తుండడం గమనార్హం. మూల్యాంకనం విధులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యాంపులోనే ఉండాల్సిన రావటం.. ఒంటిపూట బడులు నడుస్తుండటంతో ఎలాంటి రిస్కు లేని పాఠశాలలకు వెళ్లటానికే ఉపాధ్యాయులు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు మూల్యాంకనానికి ఆటంకం కలుగకుండా విద్యాశాఖ అధికారులు కేజీబీవీ, మోడల్‌స్కూల్ టీచర్లను సర్దుబాటు చేశారు. అయినా ఎలాంటి కారణాలు లేకుండా విధులకు దూరంగా ఉన్నవారిపై చర్యలు తీసుకుంటామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

తడారుతున్న 'కడెం' ఆయకట్టు

- ఆందోళనలో రైతులు



నీటి కోసం తిప్పలు పడుతున్న రైతులు

జన్నారం: రబీలో కడెం ప్రాజెక్టు కింద వరి సాగుచేసిన రైతులకు చివరకు నీటి తడి కోసం తిప్పలు పడుతున్నారు. యాసంగి ప్రారంభంలో ప్రాజెక్టు పూర్తి ఆయకట్టుకు సాగునీరందిస్తామని, రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావు హామీ ఇచ్చారు. దీంతో రైతులు సంతోషంగా యాసంగి పంటలు సాగుచేశారు. మరో 20 రోజుల్లో పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది. కానీ ఇదే సమయంలో పంటలకు నీరందడం లేదు. మరో రెండు తడులు అవసరం కాగా, కడెం నీరు చివరి పొలాల వరకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జన్నారం, దండెపల్లి మండలాల్లో కడెం నీరు చేరక రైతులకు తిప్పలు తప్పడం లేదు. కడెం ప్రాజెక్టు కింద జన్నారం మండలంలో 3,500 ఎకరాల్లో రబీలో వరి సాగుచేశారు. నీటిని అధికారులు విడతల వారీగా వదిలారు. అయితే పంట చివరి దశలో నీరందడం లేదు. ప్రాజెక్టు నుంచి నీరు తక్కువగా వదలడంతో అది ఉప కాలువలకు చేరడం లేదు. కొందరు రైతులు ప్రధాన కాలువ తూముల వద్ద ఇసుక బస్తాలు వేసి నీటిని అడ్డుకుంటున్నారు. దీంతో ఆయకట్టు చివరి పంటలకు తడి అందడం లేదు. మండలంలోని తపాలాపూర్, బాదంపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో కొంతమంది రైతుల పంటలు ఎండిపోతున్నాయి. తపాలాపూర్, రొటిగూడ, మహ్మదాబాద్, రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం ప్రధాన కాలువ వెంట తిరిగి ప్రవాహానికి ఉన్న అడ్డు కట్టలను తొలగించారు. పంటలకు మరో రెండు తడులు అవసరమని రైతులు చెబుతుండగా అధికారులు మాత్రం ఒక తడికే నీరిస్తామని పేర్కొంటున్నారు.

నీరందించేలా కృషి
ప్రధాన కాలువకు మధ్యలో కొందరు రైతులు బస్తాలు అడ్డు పెట్టడం, ఉప కాలువల తూముల వద్ద అడ్డు కట్ట వేయడంతో నీరు చివరి వరకు చేరడం లేదు. రైతులతో కలిసి కాలువను పరిశీలిస్తున్నాం. అడ్డుగా పెట్టిన బస్తాలను, తుక్కును తొలగిస్తున్నాం. నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.
– వెంకటేశం, నీటిపారుదల శాఖ డీఈ

అత్యాపత్యా జిల్లా కమిటీ



నూతన కమిటీని ఉద్దేశించి మాట్లాడుతున్న రమేశ్

మందమర్రిరూరల్: అత్యాపత్యా అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి రమేశ్ ఎన్నికల అధికారి కాంపెల్లి సమ్మయ్య సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కంభగోని సుదర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సకినాల శంకర్, కోశాధికారిగా గోగర్ల సాయి, ఉపాధ్యక్షులుగా జక్కుల సమ్మయ్య, రాజేందర్, దీపిక, జాయింట్ సెక్రెటరీలుగా మనోహర్, సురేందర్, వర్ష, కార్యవర్గ సభ్యులుగా శృతి, వెంకటేశ్, నరే శ్, రఘును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కనుమరుగవుతున్న అత్యాపత్యా క్రీడను జిల్లాలో పునరుద్ధరిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామ శివారులోని పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి రూ.68 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


ఉష (ఫైల్)

సిర్పూర్(టి): మనస్తాపంతో మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నవేగాంలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం నవేగాం గ్రామానికి చెందిన కుత్తర్‌వార్ పరశురాంకు కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన ఉష(28)తో ఐదేళ్లక్రితం వివాహం జరిగింది. ఇప్పటికీ సంతానం లేకపోవడంతో మనస్తాపానికి గురైంది. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం మృతురాలి తండ్రి హుల్కే దేవాజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పెన్‌గంగలోపడి యువకుడు మృతి

సిర్పూర్(టి): ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని హుడ్కిలిలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చౌదరి కై లాస్ (25) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పాటు ఫిట్స్‌తో బాధపడతున్నాడు. ఈ నెల 15న పెన్‌గంగ సమీపంలో ఉన్న పంటచేనుకు వెళ్లిన కై లాస్ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పెన్‌గంగనది ఒడ్డున చెప్పులు కనిపించాయి. నదిలో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. మృతుని తండ్రి చౌదరి ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో బాలుడు మృతి


లక్కీ (ఫైల్)

కౌటాల(సిర్పూర్): తమ కుమారుడు జీవితంలో అదృష్టవంతుడు కావాలని ఆ తల్లిదండ్రులు లక్కీ అని పేరు పెట్టుకున్నారు. కానీ ఆ బాబుకు పేరులో ఉన్న లక్కీ నిజ జీవితంలో లేకుండా పోయింది. మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన నవుగడే కారు– శశికల దంపతులకు లక్కీ(1) ఒకే సంతానం. మూడు రోజులుగా బాబుకు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న వైద్యులకు చూపించారు. అయినా జ్వరం తగ్గక పోవడంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్, వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి బాలుడు మృతి చెందాడు. ఆదివారం బాలుడి మృతదేహాన్ని తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన తలారి ప్రియాంక (20) నాలుగు రోజుల క్రితం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని తన అక్క తలారి పల్లవి ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి నుంచి కనిపించడంలేదని యువతి బావ దినేష్ ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

తాగి నడిపితే బీమా కట్!

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- ఇన్సూరెన్స్ నిబంధనలు కఠినతరం


డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై సాయన్న


ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్‌రావు(ఫైల్)

నేరడిగొండ(బోథ్): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో నివారణ సాధ్యం కావడం లేదు. తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించడంతో పాటు జైలుకు పంపిస్తున్న విషయం తెలిసిందే. అయినా చాలామంది రోడ్డు నిబంధనలు తుంగలో తొక్కుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపిస్తున్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇకపై మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ (బీమా) రాకుండా చేస్తోంది.

ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ రక్త నమూనాల సేకరణ

ఉమ్మడి జిల్లాలోని ఆయా చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆధారాలు సేకరించడం, ప్రమాదకారకులను గుర్తించడం గతంలో పోలీసులకు చాలా కష్టంగా ఉండేది. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే డ్రైవర్ల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఒకవేళ డ్రైవర్ మృతి చెందితే జీర్ణాశయం నుంచి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబరేటరీకి పంపిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ అయితే ఐపీసీ 304ఏ కింద కేసులు నమోదు చేస్తాం. ఫలితంగా సదరు డ్రైవర్ బీమా సొమ్ము కోల్పోవడం జరుగుతుంది.

ఇవి పాటించకుంటే బీమా రానట్లే..

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేనట్లయితే ప్రమాదానికి లోనైతే బీమా వర్తించదు.
- కారు ప్రయాణం చేసేటప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోతే ప్రమాదం జరిగితే ఏ విధమైన బీమా వర్తించదు.
- సక్రమమైన మార్గంలో వచ్చే వాహనదారుడిపై ఎలాంటి కేసులు నమోదు చేయడం జరగదు.
- రాంగ్‌రూట్‌లో వచ్చేవారితో ఇతరులకు ప్రమాదం జరిగితే ప్రమాదానికి కారకుడైన వ్యక్తి రూ.20 లక్షల పరిహారాన్ని మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే 14 ఏళ్ల జైలుశిక్ష విధిస్తారు.
- ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపి ప్రమాదాలు చేస్తే పై శిక్షలే విధించడం జరుగుతుంది.
- వీరి తరఫున పైరవీ చేసిన వారి డ్రైవింగ్ లైసెన్స్ ఐదేళ్లపాటు రద్దు చేసే అవకాశం ఉంది.

కుటుంబాలకు తప్పని మానసిక క్షోభ

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారు ప్రమాదాల్లో మరణిస్తే ప్రమాద బీమా రాని పరిస్థితి నెలకొంది. దీంతో బాధిత కుటుంబం మానసిక క్షోభకు గురికానున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకులోనైతే తల్లిదండ్రులు, భార్య, పిల్లలు అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మద్యం తాగి వాహనం నడుపుతూ జరిమానా కట్టడంతో పాటు జైలుకు వెళ్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులై ఇతరుల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు.

ప్రజలదే ప్రథమ కర్తవ్యం..

రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రజలే ప్రథమ కర్తవ్యంగా భావించాలని పోలీసులు పేర్కొంటున్నారు. నిబంధనలను పోలీసులు కచ్చితంగా అమలు చేస్తుండగా కొన్నిసార్లు మానవీయ కోణంలోనూ ఆలోచిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలు నడిపిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించవని సూచిస్తున్నారు. మానవ తప్పిదంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మద్యం సేవించి వాహనాలు నడపడంతో జరిగే అనర్థాలపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నాం. యువతను చైతన్య పరుస్తున్నాం. ప్రమాదాలు జరిగిన సమయంలో మానవీయ కోణంలో ఆలోచిస్తున్నప్పటికీ నిబంధనల అమలు కూడా తప్పనిసరి. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుంది. ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. – **నైలు, సీఐ, ఇచ్చోడ సర్కిల్**

ప్రశాంతంగా బీఎల్వీ పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన బ్యాక్‌లాగ్ వేకెన్సీస్(బీఎల్వీ–2023) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,927 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,304 మంది హాజరయ్యారు. మరో 623 మంది విద్యార్థులు గైర్హాజర్ కావడంతో హాజరుశాతం 84.14 నమోదైందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. పలు పరీక్ష కేంద్రాలను కోఆర్డినేటర్ స్వరూపారాణి పర్యవేక్షించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని కుంటాల శివారు ప్రాంతంలో ఓడ్నం కృష్ణకు చెందిన పంటచేనులో విద్యుత్ నిప్పురవ్వలు పడి మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు కృష్ణ ఈ ఏడాది రబీ సీజన్‌లో రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ప్రస్తుతం పంట కొతకు రావడంతో నూర్పిడి చేసేందుకు పంటచేనులోనే ఉంచాడు. ఆదివారం మధ్యాహ్నం పంట చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఐదు క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధమైంది.

యోగా జీవితంలో భాగం కావాలి


యోగా చేస్తున్న జీఎం సంజీవరెడ్డి, అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): యోగా మానవుని జీవితంలో భాగం కావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం రాత్రి రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో హర్ దిల్ ధ్యాన్ హర్ దిన్ యోగా మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. జీఎం హాజరై యోగా తరగతులు ప్రారంభించారు. యోగా, ధ్యానం వల్ల ఎన్నో ఆరోగ్య లాభాలు ఉంటాయన్నారు. అనేక శారీరక జబ్బులతో పాటు మానసిక వ్యాధులు నయం అవుతాయన్నారు. దీర్ఘకాలికంగా ఉండే బీపీ, షుగర్, ఇతర వ్యాధులు నయం కావడానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. మూడు రోజుల పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు రామచంద్ర మిషన్ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, సీనియర్ పీవో దేవేందర్‌రెడ్డి, సునీల్, సభ్యులు పీ శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వానర ప్రేమికుడు..

చేసేది పోడు వ్యవసాయం.. ఉండేది పెంకుటింట్లో.. కానీ అతని మనసు మాత్రం ఎంతో పెద్దది. మూగ జీవాలపై అతనికి ఉన్న ప్రేమతో ఆరేళ్లుగా వానరులకు ఆకలి, దప్పిక తీరుస్తున్నాడు. అతనే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రానికి చెందిన వాగ్మారే లక్ష్మణ్.

- ఆరేళ్లుగా మూగజీవాలకు సేవ
- ఆకలి, దప్పిక తీరుస్తున్న వాగ్మారే లక్ష్మణ్


వానరాలకు పండ్లు అందిస్తున్న లక్ష్మణ్


డ్రమ్ములో నీళ్లు పోస్తున్న లక్ష్మణ్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వాగ్మారే లక్ష్మణ్ ఆరేళ్ల క్రితం ఒక రోజు కెరమెరి ఘాట్‌పై వానరాలు దాహంకోసం పరితపిస్తుండడాన్ని చూసి చలించిపోయాడు. వాటికి కనీసం నీళ్లయినా అందించి పుణ్యం చేద్దామనుకున్నాడు. అనుకున్నదే అదే తడవుగా 2017 నుంచి కెరమెరి ఘాట్‌పై ఉన్న వానరాలకు వర్షాకాలం మినహా అన్నికాలాల్లో రోజుకు రెండుసార్లు నాలుగు క్యాన్లలో నీటిని తీసుకెళ్లి వాటి దాహం తీరుస్తున్నాడు. అంతేకాకుండా వివిధ రకాల పండ్లను సైతం తీసుకెళ్లి వాటి ఆకలి తీరుస్తున్నాడు. కెరమెరి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఘాట్ వద్దకు బస్సులేదా ఆటోల్లో వెళ్తున్నాడు. మూగజీవాల ఆకలి, దప్పిక తీరుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

వర్షాకాలం మినహా...

మండల కేంద్రానికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్‌కు కేవలం ఎకరం పోడు వ్యవసాయం మాత్రమే ఉంది. మరో పదెకరాల వరకు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అతని సంపాదనలో నుంచి అధికభాగం ఈ మూగజీవాలకే పెడుతున్నాడు. తన సతీమణి అనసూయ వద్దని ఎంత వారించినా వినకుండా వర్షాకాలం మినహా అన్నికాలాల్లో రోజుకు సుమారు రూ.400 నుంచి రూ.500 వరకు వాటి కోసం ఖర్చు చేస్తున్నాడు. రోజూ నాలుగు క్యాన్లలో నీళ్లు, టమాటాలు, అరటిపండ్లు, పుచ్చకాయలు, పుట్నాలు, పల్లీలు, సపోటాలతో పాటు ఇతర పండ్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు.

అదృష్టంగా భావిస్తున్నా



నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ వనరుల దప్పిక, ఆకలి తీరుస్తా. ఆరేళ్లుగా వాటికి సేవ చేస్తున్నా. ప్రతీరోజు బస్సు లేదా ప్రైవేటు వాహనాల్లో పండ్లు, ఫలాలు, నీటిని తీసుకెళ్తా. రాముని దూతలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.
– వాగ్మారే లక్ష్మణ్, కెరమెరి

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి బాలుడు మృతి


మౌర్యతేజ మృతదేహం

జన్నారం(ఖానాపూర్): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తానాజీ నాయక్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముడికె గోపాల్, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో పెద్ద కుమారుడు ముడికే మౌర్యతేజ (12) జన్నారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు సమీపంలోని వాగు వద్దకు వెళ్లారు. వాగులో లోతు ఎక్కువగా ఉండడంతో మడుగులో స్నానం చేసేందుకు సిద్ధమయ్యారు. ముందుగా మౌర్యతేజ మడుగులోకి దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు వెంటనే గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో నీటిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై తానాజీ నాయక్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'పాయల్' తనయుడి ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని హల్‌చల్
- కేసులో ఇరికించేందుకు డీఎస్పీ కుట్ర అని ఆరోపణ
- నేటి బంద్ జయప్రదం చేయాలని శరత్ పిలుపు


పాయల్ శరత్‌ను పోలీసు వాహనం నుంచి దించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ తనయుడు పాయల్ శరత్ (బన్ని) తన ఇంటి ఎదుట పోలీసుల సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించిన డీఎస్పీ ఉమేందర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన ఘర్షణకు బాధ్యులైన యువకులతో పాయల్ శరత్‌కు సంబంధం ఉందని పేర్కొనడం వివాదానికి దారి తీసింది. డీఎస్పీ వ్యాఖ్యలను తప్పుబడుతూ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయనను ప్రశ్నించేందుకు వన్‌టౌన్‌కు వెళ్లిన శరత్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఆయనను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు. పట్టణంలోని పలు వీధుల గుండా తిప్పుతూ జాతీయ రహదారిపైకి ఎక్కించారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు పోలీసు వాహనాన్ని వెంబడించడంతో తిరిగి ఆయనను శాంతినగర్‌లోని తన ఇంటివైపు తీసుకొచ్చారు. వాహనం నుంచి దింపేందుకు యత్నించగా ఆయన దిగకుండా నిరసనకు దిగారు. తనను అకారణంగా తప్పుడు కేసులో ఇరికిస్తున్నారని పేర్కొంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అప్రమత్తమైన పోలీసులు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలతో పాటు సాయుధ బలగాలను రంగంలోకి దించారు. దాదాపు గంటకు పైగా హైడ్రామా నెలకొంది. చివరకు వాహనంలో నుంచి శరత్ దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. శరత్ మాట్లాడుతూ ర్యాలీలో జరిగిన ఘర్షణలో తమ పార్టీ కార్యకర్తలు, తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన కూతురిపై ప్రమాణం చేశారు. తనకు ఫోన్ చేసి రౌడీ షీట్ ఓపెన్ చేయడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తానని, రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తానని డీఎస్పీ బెదిరించినట్లు తెలిపారు.

ఆదిలాబాద్ బంద్ విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: హిందూ యువకులపై దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. దళిత గిరిజన సంఘాలు, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆమె కోరారు.

కూలర్ల ఏర్పాటులో జాప్యం తగదు

తాండూర్(బెల్లంపల్లి): ఎండ తీవ్రతను దృష్టిలోపెట్టుకుని సింగరేణి ఓసీపీలు, వివిధ విభాగాల్లో ఈపాటికే కూలర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా సింగరేణి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఆరోపించారు. ప్రస్తుతం కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎండతీవ్రత ఎంతగానో పెరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఓపెన్‌కాస్ట్ గనులు, విభాగాల్లో చల్లదనం కోసం కూలర్లను ఏర్పాటు చేసి ఉపశమనం కలిగించాల్సి ఉందన్నారు. కార్మికుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. యాజమాన్యం కూలర్ల ఏర్పాటు కోసం టెండర్లు పిలిచినా ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారుల పట్టింపులేని తనంతో కూలర్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కూలర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బెల్లంపల్లి ఏరియాలో కార్మికుల పనివేళలను మార్చాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బెల్లంపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగా యాల పాలైన సంఘటన బెల్లంపల్లి మండలం కన్నాల శివారు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం ... ఆదివారం సాయంత్రం కాసిపేట మండలం వరిపేట గ్రామానికి చెందిన పోలవేణి రాములు, సిడం పెద్దయ్య ద్విచక్రవాహనంపై బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు వెళ్తుండగా మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు కుడి కాలు తెగిపోగా పెద్దయ్యకు బలమైన గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ముందుగా అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. ప్రమాదస్థలాన్ని వరంగల్ సీబీసీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్ సందర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా యూటర్న్ ఏర్పాటు చేయడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవి దుక్కులతో ఎంతోమేలు


పత్తి చేనులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

- పెరుగనున్న భూసారం
- అధిక దిగుబడులు

చెన్నూర్‌రూరల్: పత్తి ఏరిన తరువాత రైతులు పత్తి కర్రలను కాలుస్తున్నారు. అంతే కాకుండా వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఈ వేసవి దుక్కులతో కూడా మంచి లాభాలు ఉన్నాయని ఏడీఏ జాడి బాపు పేర్కొన్నారు. సరిపడా తేమ ఉన్న పొలాల్లో సుమారు తొమ్మిది అంగుళాల లోతుకు తగ్గకుండా దుక్కులు చేసుకోవడంతో ప్రయోజనం ఉంటుందని ఆయన వివరించారు.

వేసవి దుక్కులతో లాభాలు

లోతు దుక్కులు దున్నినప్పుడు నేల పైపొరలలో ఉండే పురుగులను, తెగుళ్లను నశింప జేయడానికి అవకాశం ఉంటుంది. నేలను లోతుగా దున్నినప్పుడు నేలలో దాక్కునే లేదా నిద్రావస్థలో ఉండే పురుగులు, నేలలో ఉండి తెగుళ్లు కలుగజేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకుతుంది. ఏప్రిల్, మే నెలల్లో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు ఈ పురుగులు, శిలీంద్రాలు నశిస్తాయి. కాబట్టి తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. తుంగ, గరిక, దర్భ, జమ్ము వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలాలలో పెరిగి పంటలకు నష్టం కలిగిస్తుంటాయి. వీటి వేర్లు, దుబ్బులు, కాయలు నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ చాలా కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కలు, కాయలు, వేర్లు, దుంపలు, పెకిలించబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు నశించే అవకాశం ఉంటుంది. నేల పైకి తేలిన కాయలు, దుంపలు, వేర్లను ఏరివేసి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దుక్కిదున్ని తొలకరి వర్షాలకు గొర్రు గుంటుకలతో దున్నినప్పుడు నేల బాగా గుల్లబారుతుంది. తొలకరిలో వేసే పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటుక, దంతెలు వంటి పరికరాలు నేల లోపలికి 3 నుంచి 5 అంగుళాల లోతు వరకు చొచ్చుకుపోతాయి. నేల లోపల గట్టి పొర ఏర్పడుతుంది. దీనివల్ల నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కాబట్టి నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదింపబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది. పంట కోత తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ వేసవిలో లోతుగా దుక్కి దున్నడంతో నేలలో కలిసి కుళ్లిపోతాయి. దీనివలన నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరగడానికి అవకాశం ఉంటుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడంతో పొలంలో కలుపు, గత పంట మొదళ్లు లేకుండా శుభ్రంగా ఉంటుంది. అందువల్ల తొలకరి వర్షాలకు నేలలో గొర్రు, గుంటుకలతో దున్నుకుని తొలకరి పంటలను ఆలస్యం లేకుండా తొందరగా విత్తుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ వేసవి కాలంలో పంటలు పూర్తయిన వెంటనే పొలాలు, చేన్లను లోతు దుక్కి చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వేసవి దుక్కులతో ముందుగా భూమి వదులుగా అవుతుంది. దీంతో భూమిలోపల ఉన్న చెడు క్రిమి కీటకాలు పూర్తి నశించి పోయి, తొలకరి జల్లులు కురిసినప్పుడు, నీరు భూమిలోకి ఇంకి పోతుంది. దీంతో అధిక వర్షం కురిసినా భూమి కోతలకు గురికాకుండా ఉంటుంది. పత్తి గింజలు వేసిన తర్వాత మొలకలు అక్కడక్కడా కాకుండా అంతటా ఒకే రకంగా మొలుస్తాయి. మొలక శాతం పెరుగుతుంది. సకాలంలో పంటలు వేసుకునేందుకు వీలుగా ఉంటుంది. సారవంతమైన ఉపరితల నేలవృథా కాకుండా ఉండి పోతుంది. గాలి భూమి పొరల్లోకి వెళ్లి మొక్కల వేర్ల వ్యవస్థ విస్తరిస్తుంది. దీంతో మొక్కలు బలంగా తయారవుతాయి. అంతే కాకుండా భూమిలో మొక్కలకు ఉపయోగపడే క్రిమి కీటకాలు తయారై మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతాయి. దీంతో దిగుబడులు బాగా ఉండి సకాలంలో పంటలు చేతికొస్తాయి.